# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

సోమవారం | 25 ఆగస్టు 2025 | పేజీలు 8




# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ సాధిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం (ఆగస్ట్ 24) హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో ఏపీఏసీ బయోడిజైన్ సమ్మిట్ కార్యక్రమం జరిగింది. వైద్య పరికరాల తయారీలో స్వయం ప్రతిపత్తే లక్ష్యంగా జరిగిన ఈ సమ్మిట్?కు సీఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్?గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇన్నోవేటింగ్ ఫర్ భారత్ ది బయోడిజైన్ బ్లూప్రింట్ ఆవిష్కరించారు.

అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. లైఫ్ సైన్సెస్, మెడికల్ టెక్నాలజీ విభాగంలో తెలంగాణ హబ్?గా ఎదిగిందన్నారు. సుల్తాన్ పూర్ లో దేశంలోనే పెద్ద మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు చేశామని, ఇప్పటికే 60పైగా కంపెనీలు అక్కడ ఉన్నాయని తెలిపారు. మెడికల్ డేటాను పరిశోధన కోసం కంపెనీలకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇన్నోవేటర్స్, స్టార్ట్?ప్?ల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని అన్నారు. మానవాళిని ఆరోగ్యంగా మార్చడానికి ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు.

# ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాజపా మీడియా, ఐటీ, సామాజిక మాధ్యమాల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. -2 లో





## తెలంగాణలో బీజేపీ గెలిచిన 8 ఎంపీ సీట్లు

# దొంగ ఓట్లే

## పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో బీజేపీ గెలిచిన 8 ఎంపీ సీట్లు దొంగ ఓట్లతో గెలిచినవేనని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కూడా దొంగ ఓట్లతోనే గెలిచారని.. వాస్తవానికి కరీంనగర్?లో బండి సంజయ్ గెలిచే పేస్ కాదని హాట్ కామెంట్స్ చేశారు. బండి సంజయ్ తెల్లారి లేస్తే బీసీ అని చెప్పుకుంటారని.. మరీ బీసీ రిజర్వేషన్ల కోసం ఆయన ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్?ని తొలగిస్తే ఒక బీసీగా తాను గొంతెత్తానని.. ఒక బీసీ బిడ్డను అధ్యక్ష పదవి నుంచి ఎలా తొలగిస్తారని బీజేపీని ప్రశ్నించానని గుర్తు చేశారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుంటే బండి సంజయ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. భవిష్యత్ బీసీ తరాలకు ఒక బీసీ బిడ్డగా బండి సంజయ్ అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. మేం దేవుడిని నమ్ముతాం కానీ దేవుడి పేరుతో ఎప్పుడూ ఓట్ల అడగలేదని బీజేపీపై ఫైర్ అయ్యారు. ఎన్నికలప్పుడు దేవుడు.. గెలిచిన తర్వాత హిందూ-ముస్లిం గొడవలు పెట్టి పబ్బం -2 లో

## మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం..

# స్క్రాప్ దుకాణంలో చెలరేగిన మంటలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మశాలి టౌన్షిప్ స్క్రాప్ దుకాణంలో ఆదివారం (ఆగస్ట్ 24) రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.స్క్రాప్ దుకాణం నుంచి ఎగిసి పడుతోన్న మంటలను ఫైరింజన్ల సహాయంతో ఆపేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంటలు భారీగా చెలరేగి పొగ దట్టంగా అలుముకోవడంతో స్థానికులు భయాందోళకు గురయ్యారు. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఏంటనే దానిపై ఆరా తీస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రమాద సమయంలో స్క్రాప్ దుకాణంలో ఎవరైనా కార్మికులు ఉన్నారా అన్న విషయం తెలియరాలేదు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలపై క్లారిటీ లేదు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు ఢిల్లీలో న్యాయకోవిదులతో

# సీఎం భేటీ

- 'స్థానికం'లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల కల్పనకు అనుసరించాల్సిన విధానంపై చర్చ
- పాల్గొననున్న భట్టి, ఉత్తమ్
- మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి అనుసరించాల్సిన విధానంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రముఖ న్యాయ కోవిదులతో భేటీ కానున్నారు. ఇందుకోసం సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం దేశరాజధానికి వెళ్లనున్నారు. న్యాయకోవిదులతో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించాలని ఈ అంశంపై ఏర్పాటైన రాష్ట్ర మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ సమావేశమై అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో చర్చించింది. కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. మరో సభ్యుడైన -2 లో

# ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

- మొదటి పేజి తరువాయి

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి 19 నెలలైనా ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. "రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధులను సరిగా వినియోగించకుండా దారి మళ్లిస్తోంది. భారత రాష్ట్ర సమితి హయాంలో పలువురు సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక, అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు" అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సిద్ధాంతాలు, కేంద్రం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. భాజపా విజయానికి సామాజిక మాధ్యమాల విభాగం కీలకంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా అంశంలో కావాలనే కృత్రిమ కొరత సృష్టించి మోదీ ప్రభుత్వాన్ని చెడుగా చూపించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

**రిజర్వేషన్ల హామీ నిలబెట్టుకోని కాంగ్రెస్**

భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ దేశమంతా ప్రస్తుతం తెలంగాణ వైపు చూస్తోందని, రాష్ట్రంలో భాజపా రోజురోజుకూ బలపడుతోందన్నారు. కాంగ్రెస్‌కు భాజపానే ప్రత్యామ్నాయం అవుతుందనే సంకేతాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో భాజపాకు ఓటువేసేలా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. భాజపా సామాజిక మాధ్యమాల జాతీయ కన్వీనర్ ప్రేమ్‌శుక్లా మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పేరుతో భాజపాపై నిందలు వేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ నేతలు సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు దిల్లీలో న్యాయకోవిదులతో

# సీఎం భేటీ

- మొదటి పేజి తరువాయి

మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో తన అభిప్రాయాన్ని తెలియజేశారు. న్యాయపరమైన అవరోధాలు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఎలా ముందుకెళ్లాలని మంత్రుల కమిటీ చర్చించింది. రాష్ట్రంలో కులగణన చేపట్టి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపామని భట్టి వివరించారు. అది గవర్నర్ నుంచి రాష్ట్రపతి వద్దకు వెళ్లిందని.. అక్కడ 5 నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. మరోవైపు సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో న్యాయపరమైన వివాదాలు ఏర్పడకుండా రిజర్వేషన్ కల్పించాలంటే ఏం చేయాలో సలహా ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం కోరారు. ఇతర రాష్ట్రాల్లో గతంలో రిజర్వేషన్ల పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే కోణంలో ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది. ఈ విషయంలో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తదితరుల అభిప్రాయాన్ని తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

**గవర్నర్‌లకు గడువుపై రాష్ట్రం తరఫున వాదనలు..**

మరోవైపు బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతి, గవర్నర్‌లకు నిర్దిష్ట గడువు ఉండేలా చూడాలని సుప్రీంకోర్టులో ఇప్పటికే కేసు విచారణలో ఉంది. ఆ కేసులో తెలంగాణ తరఫున బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం గురించి ప్రస్తావించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రం తరఫున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించాలని యోచిస్తోంది. ఈ విషయంపైనా సోమవారం దిల్లీలో న్యాయకోవిదులతో రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్ చర్చించనున్నారు. రిజర్వేషన్ల అంశంపై ఎలా ముందుకెళ్లాలనేది తేలిన తర్వాత ఈ నెల 29న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఈలోగా కాంగ్రెస్ సీనియర్ నేతల కమిటీ కూడా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందని పీసీసీ వర్గాలు తెలిపాయి. అధికారికంగా రిజర్వేషన్ల అమలుకు గట్టి చర్యలు తీసుకునే ఉద్దేశంతోనే మంత్రుల, కాంగ్రెస్ నేతల కమిటీలు అధ్యయనం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

# తెలంగాణలో బీజేపీ గెలిచిన 8 ఎంపీ సీట్లు దొంగ ఓట్లే

- మొదటి పేజి తరువాయి

గడుపుతారని కమలం పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివారం ( ఆగస్టు 24 ) కరీంనగర్?లో రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పాదయాత్రలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. మన భవిష్యత్ కోసమే ఈ జనహిత పాదయాత్ర అని.. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికే ఈ పాదయాత్ర చేపట్టామని తెలిపారు.

కాంగ్రెస్ ఒక్కసారి మాట ఇస్తే తప్పకుండా నేరవేర్చి తీరుందన్నారు. రాష్ట్రంలో ఎన్నో అద్భుత పథకాలు కాంగ్రెస్ అమలు చేస్తోందని, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తారని కలలోనైనా ఊహించామా అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలు కూడా సన్న బియ్యం అన్నం తినాలనే ఉద్దేశంతో రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఇక, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఆ పార్టీ రాష్ట్రంలో లేదన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉన్నది మతపిచ్చి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు.

# గగన్ యాన్ మిషన్ లో కీలక ముందడుగు...

# ఇస్రో ఎయిర్ డ్రాప్ టెస్టు విజయవంతం

- గగన్‌యాన్ మిషన్ కోసం ఇస్రో కీలక పరీక్ష విజయవంతం
- పారాచూట్ ఆధారిత వేగాన్ని తగ్గించే వ్యవస్థపై ప్రయోగం
- ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ–01) సక్సెస్
- వ్యోమగాముల సురక్షిత ల్యాండింగ్‌కు ఈ పరీక్ష కీలకం
- ఇస్రో, డీఆర్‌డీఓ, వైమానిక, నౌకాదళాల సమన్వయంతో పరీక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. మానవసహిత అంతరిక్ష యాత్రలో వ్యోమగాముల భద్రతకు అత్యంత ముఖ్యమైన పారాచూట్ వ్యవస్థ పనితీరును పరీక్షించేందుకు చేపట్టిన "ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ–01)"ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం గగన్‌యాన్ మిషన్ విజయానికి చాలా కీలకమైనదిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చే క్రమంలో వ్యోమగాములు ఉండే మాడ్యూల్ వేగాన్ని నియంత్రించి, దానిని సురక్షితంగా దించడం కోసం ఈ పారాచూట్ వ్యవస్థను ఉపయోగిస్తారు. ఈ వ్యవస్థ మొదటి నుంచి చివరి వరకు ఎలా పనిచేస్తుందో సమగ్రంగా నిరూపించేందుకే ఈ తాజా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా పారాచూట్ వ్యవస్థ పనితీరును విజయవంతంగా ప్రదర్శించినట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి.

ఈ కీలక ప్రయోగం కేవలం ఇస్రో ఒక్కటే కాకుండా, దేశంలోని పలు ప్రముఖ రక్షణ, పరిశోధనా సంస్థల సమష్టి కృషితో సాధ్యమైంది. భారత వైమానిక దళం డీఆర్‌డీఓ, భారత నౌకాదళం, ఇండియన్ కోస్ట్ గార్డ్



ఈ పరీక్షలో ఇస్రోతో కలిసి పాలుపంచుకున్నాయి. ఈ సంస్థలన్నీ సమన్వయంతో పనిచేసి ఈ క్లిష్టమైన ప్రయోగాన్ని విజయవంతం చేశాయి. గగన్‌యాన్ మిషన్ ద్వారా వ్యోమగాములను సురక్షితంగా అంతరిక్షంలోకి పంపి, తిరిగి భూమికి తీసుకురావడమే లక్ష్యంగా ఇస్రో ముందుకు సాగుతోంది. ఈ ప్రయోగ విజయం ఆ లక్ష్య సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది.

# రాయితో తల పగలకొట్టి.. భర్తను చంపిన భార్య... ఆ మూడో వ్యక్తి ఎవరు..?




**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లో ఘోరం జరిగింది. రాయితో తల పగలకొట్టి భర్తను దారుణంగా చంపేసింది భార్య. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ గ్రామంలో జరిగింది ఈ ఘటన. మరో వ్యక్తితో కలిసి భర్త రాకేష్ కుమార్ ను హత్య చేసింది భార్య పూనమ్ దేవి. మృతదేహాన్ని బావి పక్కన పడేసి.. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యింది పూనమ్ దేవి. అజీజ్‌నగర్‌కు చెందిన రాజిరెడ్డి డెయిరీ ఫామ్‌లో జరిగింది ఈ ఘటన.రెండు నెలల క్రితం రాజిరెడ్డి ఫామ్ హౌస్ లో కూలీలుగా చేరారు రాకేష్, పూనమ్ దేవి దంపతులు.ఆగస్టు 21న రాకేష్ దంపతులతో పాటు మరో వ్యక్తి కనిపించాడని తెలుస్తోంది. తర్వాతి రోజు రాకేష్ కనిపించకపోవడంతో ఎక్కడికి వెళ్లాడని అడిగాడు యజమాని రాజిరెడ్డి. మద్యం తాగొచ్చి తనతో గొడవ పడి ఎక్కడికో వెళ్లిపోయాడని బుకాయించింది భార్య. రాకేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఏజెంట్‌కు ఫోన్ చేశాడు యజమాని రాజిరెడ్డి. పూనమ్ దేవి, మహేశ్ సాని అనే వ్యక్తి కలిసి రాకేష్‌ను చంపి బావి వద్ద పడేశారని యజమానితో చెప్పాడు ఏజెంట్. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు యజమాని రాజిరెడ్డి. యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.రాయితో రాకేష్ తలపై కొట్టి చంపినట్లు గుర్తించారు పోలీసులు. రాకేష్ దంపతులతో కన్పించిన ఆ మూడో వ్యక్తి ఎవరు..? హత్యతో అతనికి సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# హైదరాబాద్ లో కొకైన్ తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్..

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో కొకైన్ తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు పోలీసులు. హైదరాబాద్ లోని రాంకోఠి దగ్గర తనిఖీలు నిర్వహిస్తుండగా ఇన్నోవా క్రిస్టా వాహనంలో తరలిస్తున్న కొకైన్ ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఆదివారం ( ఆగస్టు 24 ) తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్ రాంకోఠి వర్ధమాన్ బ్యాంకు దగ్గర ఇన్నోవా క్రిస్టా వాహనంలో తరలిస్తున్న కొకైన్ ను స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేశారు.

నాంపల్లికి చెందిన మిస్బాహిద్దీన్ ఖాన్, బంజారా హిల్స్ కు చెందిన అలీ అస్గర్ గులని, యూఎస్ సిటిజన్ అయిన జుబైర్ అలీని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి దగ్గర నుంచి 33.3 గ్రాముల కొకైన్ ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.నిందితులను విచారించగా ,మిస్బాహిద్దీన్ ఖాన్ , అస్గర్ గులాబీ లు కొకైన్ ను తరుచు పార్టీలలో వాడుతున్నట్లు తేలింది. హైదరాబాద్ నగరంలో కొకైన్ లభ్యం కాకపోవడంతో... బెంగళూరులో ఏడాది క్రితం ఓ పార్టీలో పరిచయం అయిన మహమ్మద్ అజారుద్దీన్ వద్ద కొకైన్ ను గ్రాము 9 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు పోలీసులు. యూఎస్ సిటిజన్ అయిన జుబైర్ అలీ నెలన్నర క్రితం నగరానికి వచ్చాడని... వారు కొకైన్ కొనుగోలు చేసేందుకు అతని ఇన్నోవా కారును ట్రాన్స్ పోర్ట్ గా వాడుతున్నారని తెలిపారు పోలీసులు. కొకైన్ సప్లై చేస్తున్న మహమ్మద్ అజారుద్దీన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి , వారి వద్ద 33.3 గ్రాముల కొకైన్ ను సీజ్ చేసిన పోలీసులు తదుపరి చర్యల నిమిత్తం నారాయణగూడ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

# మృతదేహాన్ని హ్యాక్‌సా బ్లేడ్‌తో ముక్కలు చేసి.. మూసీలో పడేశాడు: స్వాతి మర్డర్ కేసులో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు





**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్: మేడిపల్లిలో భర్త చేతిలో దారుణ హత్యకు గురైన స్వాతి హత్య కేసు వివరాలను డీసీపీ పద్మజ మీడియాకు వివరించారు. పథకం ప్రకారమే స్వాతిని ఆమె భర్త మహేందర్ రెడ్డి హత్య చేశాడని తెలిపారు. డెడ్ బాడీని ఒక్కసారి తరలించడం వీలుకాక ముక్కలుగా హ్యాక్ సా బ్లేడుతో ముక్కలు చేసి తల, కాళ్లు, చేతులను వేర్వేరు కవర్లలో చుట్టి శరీర భాగాలను విడతలవారీగా మూసీలో పడేశాడని చెప్పారు. శవాన్ని మాయం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నించాడని పేర్కొన్నారు. పోలీసులు వెళ్లే చూసేవరకు మహేందర్ రెడ్డి ఇంట్లో కేవలం మొండెం మాత్రమే మిగిలిందని తెలిపారు.

మొండానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అలాగే స్వాతి బాడీ పార్ట్స్ కోసం మూసీలో గాలిస్తున్నామని వెల్లడించారు. స్వాతి, మహేందర్ రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారని, వీరిది కులాంతర వివాహమని చెప్పారు. స్వాతి హైదరాబాద్ పంజాగుట్టలో ఓ కాల్ సెంటర్‌లో పనిచేస్తుండగా.. మహేందర్‌రెడ్డి క్యాబ్ డ్రైవింగ్ చేస్తున్నాడని తెలిపారు. పెళ్లయి ఏడాదిన్నర అయ్యిందని.. పెళ్లయిన కొన్ని నెలలకే ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయన్నారు. పెద్ద మనుషులతో పంచాయతీ కూడా పెట్టించారని, పెళ్లయిన ఏడాదిన్నరలోనే నాలుగు సార్లు కౌన్సిలింగ్?కు వెళ్లారని చెప్పారు.

కులాంతర వివాహం కావడం వల్ల గొడవలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. గర్భవతి కావడంతో తనను పుట్టింటికి పంపాలని స్వాతి కోరిందని.. ఈ విషయంలో గొడవ జరిగి మహేందర్ రెడ్డి భార్యను క్రూరంగా హత్య చేశాడని తెలిపారు. గతంలో కూడా ఓ సారి స్వాతికి అబార్షన్ చేయించాడని చెప్పారు. స్వాతిని హత్య చేసిన అనంతరం ఆమె చెల్లికి ఫోన్ చేసి మీ అక్క కనిపించట్లేదని

చెప్పాడన్నారు. హత్యానంతరం ఎవరికి డౌట్ రాకుండా మేం బాగానే ఉన్నామంటూ స్వాతి ఫోన్ నుంచి ఆమె తల్లికి మెసేజ్ పెట్టాడని వివరించారు డీసీపీ పద్మజ. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని, హత్యలో ఇంకెవరైనా సహకరించారా అన్న కోణంలో ఆరా తీస్తున్నామని తెలిపారు.

# గాంధీ మెడికల్ కాలేజీకి సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయం అప్పగింత



**హైదరాబాద్ పెన్ పవర్:** గాంధీ మెడికల్ కాలేజీకి సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) భౌతికకాయాన్ని అప్పగించారు. అనాటమీ విభాగానికి సురవరం పార్థీవదేహాన్ని ఆయన కుటుంబం డొనేట్ చేసింది. సురవరం సుధాకర్ రెడ్డి అంతిమ యాత్ర ఆదివారం హైదరాబాద్‌లో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. సురవరం సుధాకర్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్?లో కన్నుమూసిన విషయం తెలిసిందే.కాగా, ఆదివారం ఉదయం 9 గంటలకు సుధాకర్?రెడ్డి పార్థివదేహాన్ని గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్ నుంచి హిమాయత్‌నగర్?లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మక్దూంభవన్?కు తరలించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు, ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు.సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్?మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వామపక్ష, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు శ్రేయోభిలాషులు సుధాకర్?రెడ్డికి నివాళి అర్పించారు. ఆ తర్వాత అధికారిక లాంఛనాలతో ర్యాలీగా తీసుకెళ్లి గాంధీ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరిశోధన కోసం సుధాకర్?రెడ్డి పార్థివదేహాన్ని అప్పగించారు. సురవరం అంతిమ యాత్రకు అన్ని జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్రచీరలు ధరించి భారీగా హాజరయ్యారు. అన్ని రాజకీయ పార్టీల అభిమానాన్ని, అందరి ప్రేమను పొందిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ నాయకులు కొనియాడారు.

## అమ్మాయి కోసం గొడవ.. కత్తులు, కొడవళ్ళతో యువకులు హల్చల్..



**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబాబాద్ పట్టణంలో యువకులు కత్తులు, కొడవళ్ళతో హల్చల్ చేశారు. అమ్మాయి కోసం ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ కత్తులు, కొడవళ్ళతో దాడికి దిగేవరకు వెళ్ళింది. ఆదివారం ( ఆగస్టు 24 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని బయ్యారం మండలానికి చెందిన ఒక వర్గం యువకులు మహబూబాబాద్ పట్టణానికి చెందిన మరో వర్గం యువకులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు.ప్రియురాలి కోసం ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ కత్తులతో దాడికి దిగే స్థాయికి వెళ్ళింది. ఇరువర్గాల యువకులు ఒకరిపై ఒకరు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్థానికులు అడ్డుకోవడంతో ఒక వర్గం యువకులు కారులోనే కత్తులు వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు స్థానికులు.స్థానికుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. పరారీలో ఉన్న బ్యాచ్ కోసం గాలిస్తున్నారు పోలీసులు. యువకుల మధ్య ఘర్షణకు కారణమైన అమ్మాయి ఎవరు?, గొడవకు గల కారణాలేంటి వంటి వివరాలపై ఆరా తీస్తున్నారు పోలీసులు.

## శంషాబాద్ విమానాశ్రయంలో రన్-వేపైనే ఆగిపోయిన విమానం.. ఒక్కసారిగా భయపడ్డ ప్రయాణికులు..



**హైదరాబాద్ పెన్ పవర్:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సాంకేతిక లోపం కారణంగా అలయన్స్ ఎయిర్ లైన్స్ రన్-వే పైనే నిలిచిపోయింది. దింతో హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లాల్సిన ఈ అలయన్స్ విమానం దాదాపు గంట సేపు పైగానే రన్వేపై ఆగిపోయింది. సమాచారం ప్రకారం విమానం రన్ వేపై నుండి బయలుదేరుతుండగా మూడుసార్లు సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్ అప్రమత్తమై వెంటనే ఫ్లైట్ ను నిలిపివేశాడు. దింతో ఫ్లైట్లో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురై కిందకి దిగారు.


అయితే ఈ విమానంలో సుమారు 37 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తుంది. సాంకేతిక లోపం కారణంగా విమానం దిగిన ప్రయాణికులు ఫ్లయిట్ స్టార్ట్ అయ్యే ముందు


సాంకేతిక లోపాలను ముందుగా చూసుకోవడం తెలిదా అంటూ సంబంధిత ఎయిర్ లైన్స్ పై ఆందోళన వ్యక్తం చేస్తూ మండిపడ్డారు. గతంలో అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన మరిచిపోకముందే చాల విమానాల్లో సాంకేతిక లోపాలు ప్రయాణకులను భయభ్రాంతులకి గురిచేస్తున్నాయి.

# శత్రువులకు ఇక చుక్కలే: స్వదేశీ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ పరీక్ష సక్సెస్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (DRDO) అభివృద్ధి చేసిన స్వదేశీ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (IADWS) పరీక్ష విజయవంతం అయ్యింది. శనివారం (ఆగస్ట్ 23) మధ్యాహ్నం 12:30 గంటలకు ఒడిశా తీరంలో ఈ వాయు రక్షణ వ్యవస్థను పరీక్షించారు. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో చేధించినట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వదేశీ వాయు రక్షణను వ్యవస్థను పటిష్టం చేసుకోవడంలో భాగంగా ఈ కొత్త వాయు రక్షణ వ్యవస్థను పరీక్షించారు.ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ ( IADWS) అనేది డీఆర్డీవో అభివృద్ధి చేసిన మల్టీ గైడెడ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. ఈ వాయు రక్షణ వ్యవస్థ ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు, చాలా తక్కువ శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ (VSHORADS) క్షిపణులు, హైపవర్ లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ (DEW) వ్యవస్థను కలిగి ఉంటుంది. IADWS శత్రు గగనతల ఆయుధాల నుంచి రక్షణ కల్పించనుంది.

స్వదేశీ ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (IADWS) పరీక్ష విజయవంతం కావడంతో డీఆర్డీవో, సాయుధ దళాలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఈ





మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. IADWS విజయవంతంగా అభివృద్ధి చేసినందుకు డీఆర్డీవో, భారత సాయుధ దళాలు, రక్షణ పరిశ్రమను అభినందిస్తున్నాను. ఈ ప్రత్యేకమైన విమాన పరీక్ష మన దేశం యొక్క బహుళ-స్థాయి వాయు-రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది. శత్రు వైమానిక ముప్పులకు వ్యతిరేకంగా మన రక్షణను బలోపేతం చేయబోతోంది" అని పేర్కొన్నారు మంత్రి రాజ్?నాథ్ సింగ్

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ కు కౌంటర్ గా దాయాది పాకిస్థాన్ దేశం మిస్సైళ్లు, డ్రోన్లతో ఇండియాపై దాడులకు తీవ్రంగా ప్రయత్నించింది. శత్రుదుర్భేద్యమైన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్?తో పాక్ దాడులకు ఎక్కడికక్కడ తిప్పికొట్టింది భారత్. ఆపరేషన్ సిందూర్?తో భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ బలమేంటో ప్రపంచానికి తెలిసింది. భవిష్యత్‌లో శత్రువుల నుంచి ఎదురయ్యే ం

ముప్పులను సమర్థవంతంగా తిప్పికొట్టడానికి ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్?ను మరింత స్ట్రాంగ్ చేసుకోవడంపై భారత్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే భారత సాయుధ దళాలు, డీఆర్డీవో సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (IADWS)ను అభివృద్ధి చేశాయి. ఈ క్రమంలోనే ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్?ను పరీక్షించగా.. ప్రయోగం విజయవంతమైంది. IADWS లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించింది. IADWS త్వరలోనే భారత అమ్ములపొదిలో చేరనుంది.

# భూపాలపల్లి జిల్లా ఫుడ్ పాయిజన్ ఘటనపై సర్కార్ సీరియస్.. సైన్స్ టీచర్‌పై హత్యాయత్నం కేసు



**హైదరాబాద్ పెన్ పవర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రెసిడెన్షియల్ ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ సర్కార్ సీరియస్ అయ్యింది. ఈ మేరకు వాటర్ ట్యాంక్‌లో పురుగుల మందు కలిపిన సైన్స్ టీచర్ రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు పోలీసులు. సైన్స్ టీచర్ రాజేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు పోలీసులు. రెసిడెన్షియల్ అసిస్టెంట్ కుక్, మరో ఇద్దరు టీచర్లు కూడా విద్యార్థులను బెదిరించినట్లు గుర్తించారు పోలీసులు. ఈ మేరకు నిందితుడు రాజేందర్, టీచర్లు సూర్య కిరణ్, వేణు, అసిస్టెంట్ కుక్ రాజేశ్వరిపై సస్పెన్షన్ వేటు పడింది. నలుగురిని విధులనుండి టెర్మినేట్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల ప్రకారం.. జయశంకర్ భూపా లపల్లి జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్?లో రెసిడెన్షియ ల్ స్కూల్ నడుస్తోంది. ఈ స్కూల్లో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు చదువుతు న్నారు. శు క్రవారం ఉదయం టిఫిన్ చేసిన తర్వాత 11 మంది విదార్థులు నీరు తాగి అస్వస్థతకు గురయ్యారు. ఆందోళన చెందిన టీచర్లు వెంటనే విద్యార్థులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. విద్యార్థులు తాగిన నీటిలో విషం కలిసినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నీళ్లలో గడ్డి మందు కలిసినట్లు తేలటంతో.. విచారణ చేపట్టారు. జిల్లా ఎస్పీ విద్యార్థుల ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయునికి, అధికారికి మధ్య వివాదాలు ఉన్నట్లు విద్యార్థులు ఎస్పీకి చెప్పారు. అధికారికి ఇబ్బంది కలిగించాలనే ఉద్దేశంతోనే సైన్స్ టీచర్ తాగే నీటిలో గడ్డి మందు కలిపినట్లు విద్యార్థులు చెప్పారు. మందు కలిపిన సీసా కూడా తమ గదిలో దొరికినట్టు విద్యార్థులు తెలిపారు. గడ్డి మందు నీళ్లల్లో కలిపిన ఆ ఉపాధ్యాయుడు ఆ నెపాన్ని తమపై నెట్టేయడానికి గడ్డిమందు వాసన వచ్చేలా తమ దుప్పట్లపై కూడా దాన్ని చల్లాడని తెలిపారు.

# స్పీకర్ పదవి గౌరవాన్ని పెంచే దిశగా కృషి చేయాలి: స్పీకర్స్ కాన్ఫరెన్స్?లో అమిత్ షా



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీలో ఆఅఖిల భారత స్పీకర్ల సమావేశాన్ని ప్రారంభించారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. కేంద్ర శాసనసభకు తొలి భారతీయ స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికైన శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం (ఆగస్టు24) నుంచి రెండు రోజులపాటు ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో విఠల్‌భాయ్ పటేల్,భారత పార్లమెంటరీ సంస్థల పరిణామానికి సంబంధించిన అరుదైన ఆర్కైవల్ రికార్డులు, ఫొటోలు, డాక్యుమెంట్లను ప్రదర్శించే ప్రత్యేక ప్రదర్శనను కూడా హోంమంత్రి ప్రారంభించారు. హోంమంత్రి మాట్లాడుతూ..దేశ స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడం కూడా అంతే ముఖ్యమని నొక్కి చెప్పారు. భారతీయుల ఆలోచనల ఆధారంగా దేశాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నడపడానికి పునాది వేసే పని విఠల్‌భాయ్ పటేల్ చేశారని అన్నారాయన.

సభ గౌరవాన్ని, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంపొందించడానికి కృషి చేయవలసిన అవసరాన్ని షా నొక్కిచెప్పారు. మన దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పాక్షికమైన వేదికను అందించాలన్నారు అమిత్ షా. సభ నిబంధనల ప్రకారం సభ సక్రమంగా జరిగేలా చూసుకోవడం ప్రతి సభ్యుని బాధ్యత అని అన్నారు. %ూ×%– ఆధారిత సాధనాలు వంటి డిజిటల్ ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టనిర్మాణంలో పారదర్శకత, సామర్థ్యం ,ప్రతిస్పందనను బలోపేతం చేయడం ఈ సమావేశం లక్ష్యం అన్నారు అమిత్ షా.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ..రెండు రోజుల పాటు జరిగే స్పీకర్ల సమావేశం.. శాసనసభల నిర్వహణకు కొత్త విధానాలను అన్వేషించేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు ,అసెంబ్లీలు కేంద్ర బిందువులని..రెండూ సరిగ్గా పనిచేయకపోతే, ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు తలెత్తుతాయని రిజిజు అన్నారు. పార్లమెంటు ,రాష్ట్ర అసెంబ్లీలు సజావుగా పనిచేయడం చాలా ముఖ్యమైనదని ఆయన నొక్కి చెప్పారు. వ్యతిరేకత ,అడ్డంకి మధ్య వ్యత్యాసం ఉందని ప్రతిపక్షం సభ్యుల హక్కు అని,

కానీ వారు పనితీరును అంతరాయం కలిగించలేరని రిజిజు అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభల స్పీకర్లు ,డిప్యూటీ స్పీకర్లతో పాటు రాష్ట్ర శాసనమండలి చైర్మన్లు ,డిప్యూటీ చైర్మన్లను పాల్గొన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా, ఢిల్లీ సీఎం రేఖ గుప్తా, మంత్రులు కూడా హాజరయ్యారు.

## నోయిడా వరకట్న హత్య కేసు..పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిపై కాల్పులు



**హైదరాబాద్ పెన్ పవర్::** గ్రేటర్ నోయిడా వరకట్న హత్య కేసులో బిగ్ ట్విస్ట్..నిందితుడు తప్పించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అతని కాలికి గాయాలయ్యాయి. ఆదివారం (ఆగస్టు24) మధ్యాహ్నం గ్రేటర్ నోయిడాలోని సిర్సా చౌక్ సమీపంలో నిందితులు విపిన్ తప్పించుకునే ప్రయత్నించాడు.. ఈ క్రమంలో పోలీసులు తుపాకీ లాక్కొని కాల్పులు జరిపేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో పోలీసులు తమను తాము రక్షించుకోవడానికి నిందితుడిపై కాల్పులు జరిపినట్లు ఉత్తరప్రదేశ్ పోలీసులు వెల్లడించారు. విపిన్‌పై తన భార్యను వరకట్నం కోసం హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో పోలీసులు విపిన్‌ను పట్టుకొని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

## నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తివేత..పోటెత్తిన పర్యాటకులు



**హైదరాబాద్ పెన్ పవర్:**నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు డ్యాంలోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

ఆదివారం (ఆగస్టు24) మధ్యాహ్నానికి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 4లక్షల 15వేల 401 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 584.40 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 297.1465టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టుమొత్తం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇక ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# మేడిపల్లి హత్య కేసు..ఎవరు కాల్ చేసినా అనుమానించేవాడు..స్వాతి చిన్నమ్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తనే తన కూతురిని చంపేశాడని తెలియడంతో స్వాతి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్వాతి స్వంత గ్రామం వికారాబాద్ లోని కామారెడ్డి ఒక్కసారిగా ఉలిక్కి పడింది. కన్న కూతురు మరణ వార్త తెలియడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. గర్భిణీ అని చూడకుండా దారుణంగా హత్య చేసిన మహేందర్ రెడ్డి కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

ప్రేమించి పెళ్లి చేసుకున్న స్వాతిని నిందితుడు మహేందర్ రెడ్డి టార్చర్ చేసేవాడని మృతురాలి చిన్నమ్మ ఆరోపించింది. ఎవరు ఫోన్ చేసిన అనుమానించేవాడని తెలిపింది. ఇప్పటివరకు కూడా వారు ఎక్కడ ఉంటున్నారనేది అడ్రస్ చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేసింది. స్పీకర్ పెట్టి మాట్లాడాలని ఆర్డర్ వేసేవాడని.. స్వాతి హింస పెట్టి చంపిన మహేందర్ రెడ్డిని కఠిన శిక్షించాలని బంధువులు డిమాండ్ చేశారు. ఇటీవల రాఖీ కట్టేందుకు మా యింటికి వచ్చిన స్వాతి తనతో బాధను చెప్పుకొని ఏడ్చిందని తెలిపింది. మహేందర్ రెడ్డి సైకోలా ప్రవర్తించేవాడని స్వాతి వాపోయిందని చెప్పింది. మహేందర్ రెడ్డి తమ అక్కను టార్చర్ చేసేవాడని.. ప్రేమించి పెళ్లి చేసుకున్న మహేందర్ రెడ్డి స్వాతి మధ్య తరుచుగా గొడవలు జరిగాయని ఆమె సోదరుడు వాపోయాడు.

వికారాబాదడ్ జిల్లా కామారెడ్డి గూడకు చెందిన యాదవ కులానికి చెందిన స్వాతి, అదే గ్రామానికి చెందిన సామల మహేందర్ రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. 25 రోజులక్రితం హైదరాబాద్ నగరానికి వచ్చి బోడుప్పల్ లోని బాలాజీహిల్స్ లో అద్దెకు ఉంటున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ భార్యభర్తల మధ్య తరుచుగా గొడవలు జరిగేవని స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం తెలుస్తోంది. ఇద్దరి మధ్య గొడవలు ముదురడంతో ఆదివారం స్వాతిని రంపంతో రెండు ముక్కలుగా కోసి చంపేశాడు భర్త మహేందర్ రెడ్డి. స్వాతిని ముక్కలుగా కట్ చేసిన శరీర భాగాలని రెండు బ్యాగులలో వేసుకొని ప్రతాప్ సింగారం మూసిలో పడేసినట్టు పోలీసుల విచారణలో నిందితుడు మహేందర్ రెడ్డి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# రాకుమారుడు ఇతరులను బాధ పెట్టిన పెట్టాడు... తనూ ఇబ్బంది పడ్డాడు.. .. అప్పుడు ఏం జరిగిందంటే



**హైదరాబాద్ పెన్ పవర్:**వైశాలి నగరాన్ని ఏలే కీర్తిసేనుడికి చంద్రసేనుడనే కుమారుడు ఉన్నాడు. లేక లేక పుట్టిన బిడ్డ కావడంతో రాజు అతడిని అల్లారుముద్దుగా పెంచాడు. కానీ అతడు తన తోటి వారినే కాకుండా పెద్దలను కూడా పోకిరి పనులు చేసి బాధపెట్టేవాడు. రాజుగారి కొడుకు కావడం వల్ల పెద్దలు ఎవరు ఏమి మాట్లాడకుండా మౌనంగా ఊరుకున్నారు. మంత్రి ఈ సంగతి గ్రహించి రాజుగారి దృష్టికి తెచ్చాడు. రాజు అప్పుడు మంత్రిని సలహా అడిగాడు. మంత్రి "మహారాజా! ఇతనిని మన సదానందుని ఆశ్రమంలో చేర్పించండి. గురువుగారి ఆశ్రమంలో ఇతడు బుద్ధిమంతుడిగా మారే అవకాశం ఉంది" అని అన్నాడు. మంత్రి సూచనతో రాజు అతడిని ఆశ్రమంలో చేర్పించాడు. కొన్ని రోజులకే గురువుగారు రాజాస్థానానికి యువరాజుతో పాటు తిరిగి వచ్చి రాజుగారితో "మహారాజా! నేను ఎంతోమందిని చూశాను. కానీ మన యువరాజులాగా ఎవరూ తుంటరి పనులు చేయలేదు. అతడు నా శిష్యులను కూడా ఇబ్బంది పెడుతున్నాడు. అతనివల్ల మా ఆశ్రమమే గాడి తప్పింది. అతడిని మార్చడం మా వల్ల కాదు. అందుకే తిరిగి తీసుకొని వచ్చాను. అతడు కొన్ని రోజులు నా దగ్గర ఉంటే నా శిష్యులు కూడా చెడిపోయే అవకాశం ఉంది" అని అన్నాడు. ఆ విషయం విని రాజు గారికి విచారం పట్టుకుంది. తన కొడుకు బుద్ధిమంతునిగా మారుతాడా! లేదా! అనే సందేహం రాజుగారికి కలిగింది. ఇలా ఉండగా ఒకరోజు ఆ యువరాజు తోటలోని పండ్లను తెంపుకోవాలని చూశాడు. అతడు ఒక రాయిని పండు కేసి విసిరాడు. ఆ రాయి పొరపాటున ఒక కోతికి తగిలింది. ఆ కోతి దానితోపాటు ఇతర కోతులన్నీ చెట్లపైనుంచి దూకి ఆ రాకుమారిని గాయపరిచాయి .

రాకుమారుడు గట్టిగా "కాపాడండి.. కాపాడండి" అని అరిచాడు. ఇంతలో తోటమాలి యువరాజు అరుపులను విని పరుగున వచ్చి ఆ కోతులను వెళ్లగొట్టి రాకుమారుని కాపాడాడు. రాకుమారుడు గాయపడడం వల్ల బాధతో మూలగసాగాడు. అప్పుడు తోటమాలి అతనికి పరిచర్యలు చేశాడు. ఆ తర్వాత రాజ వైద్యుడు వచ్చి మందులు వేసి అతని గాయానికి కట్టు కట్టాడు. ఆ తర్వాత యువరాజు ఆ తోటమాలిని తన భవనానికి పిలిపించుకున్నాడు. "తోటమాలీ! నువ్వు రాకుంటే ఆ కోతులు నా ప్రాణం తీసేవి. నాకు ఎంతో నొప్పిగా ఉంది" అని అన్నాడు. అప్పుడు తోటమాలి "తగ్గుతుంది యువ రాజా! మనం ఇతరులను బాధపెడితే వారికి కూడా అంత నొప్పి కలుగుతుందని మీరు తెలుసుకోండి. మీరు విసిరిన ఆ రాయి ఆ కోతికి తగిలి దానికి బాధ కలిగింది. అందువల్లనే అది, దానితో పాటు మిగతా కోతులు వచ్చి మిమ్మల్ని గాయపరిచాయి. లేకుంటే ఇలా జరిగేది కాదు" అని అన్నాడు. "ఓహో! అలాగా! నేను ఇన్ని రోజులు ఎంతోమందిని ఇలా గాయపరిచాను. వారు ఇంత బాధ పడతారని నాకు తెలియదు. ఇకనుండి నేను అలా చేయను" అని అన్నాడు. ఆ మాటలకు తోటమాలి ఎంతో సంతోషపడ్డాడు. కొన్ని రోజులకు ఆ యువరాజు గాయాలు మానిపోయాయి. అప్పుడు అతడు "నాన్నగారూ! నేను గురువుగారి ఆశ్రమానికి వెళ్లి విద్యను నేర్చుకుంటాను. ఎవ్వరినీ ఇబ్బంది పెట్టను" అని అన్నాడు. రాజు సంతోషించి ఆ గురువుగారిని పిలిపించి తన కొడుకులో వచ్చిన మార్పు గురించి చెప్పాడు. ఆ గురువుగారిని చూసిన యువరాజు అతనికి వినమ్రంగా నమస్కరించాడు.

గురువుగారు ఆశ్చర్యపోయి యువరాజుతో "నీకు నా ఆశ్రమంలో చేరమని ఎవరు చెప్పారు!" అని అడిగాడు. ఆ యువరాజు "నన్ను కాపాడిన తోటమాలి" అని అన్నాడు. గురువుగారు సంతోషించి తన ఆశ్రమానికి అతన్ని తీసుకొని వెళ్ళాడు. అతడు ఆ ఆశ్రమంలో అందరితో ఎంతో సఖ్యతతో ప్రేమతో ఉండసాగాడు. అనుకోకుండా జరిగిన ఆ సంఘటన ఆ యువరాజులో చాలా మార్పును తెచ్చింది. తోటమాలి ద్వారానే మంచి విషయాలు యువరాజుకు చెప్పించి, అతనిని గురువు గారి ఆశ్రమంలో విద్య నేర్చే లాగున చేసింది తన మంత్రి అని రాజుగారికి తెలియదు. ఏది ఏమైతేనేం యువరాజు మంచి వ్యక్తిత్వం కలవాడిగా తయారై అన్ని విద్యలను నేర్చుకున్నాడు. మంచి గురుభక్తి కలవాడుగా పేరు సంపాదించాడు.

## రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను కాపాడుకోవాలి.. సోషల్ జస్టిస్ కోసం అందరూ ముందుకు రావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థలను కాపాడుకోవాలని అన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్ లో ఆదివారం (ఆగస్టు 24) సేవ్ కాన్?స్టిట్యూషన్-సేవ్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం కోసం అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ ఫలాలు పొందిన యువత, ఉద్యోగులు కమ్యూనిటీ డెవలప్ మెంట్ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చాలా మంది ఉద్యోగాలు పొది పెద్ద పెద్ద పొజిషన్ కు చేరుకున్నాక.. జాతిని మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరు, కమ్యూనిటీ చెప్పుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని.. దీంతో సైలెంట్ గా ఉండిపోయి.. తమ జాతులకు సహాయం చేయకుండా ఉండిపోతున్నారని అన్నారు. అదే విధంగా రిటైర్డ్ ఉద్యోగులు, మేధావులు సోషల్ జస్టిస్ కోసం మరింత ఎత్తున ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జీవితాన్ని అందరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు మంత్రి వివేక్. అంబేద్కర్ ఎన్నో త్యాగాలు చేశారని.. 23 డిగ్రీలు చేశారని కొనియాడారు. ప్రతి విషయంపైన చాలా స్పష్టతతో ఉండేవారని కొనియాడారు. కుటుంబాన్ని పక్కన పెట్టి జాతికోసం పనిచేశారని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పనిచేయాల్సిన అవసరం ఉందిఅంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా తాము చాలా గ్రామాలలో విగ్రహాలు పెట్టించడం జరిగిందని.. విగ్రహాన్ని చూసినప్పుడైనా ఆయన ఆశయాలు, ఆలోచన విధానం ఏంటో తెలుసుకోవాలనే ఆలోచన కలగాలనేదే లక్ష్యం అని చెప్పారు. రాజ్యాంగం రాసేటప్పుడు ఆయన ఎలా కష్టపడ్డారో.. ఎలా ఎదిగారో విగ్రహాన్ని చూసి నేర్చుకుంటారని అన్నారు. రాజ్యాంగ రచనలో బాబాసాహెబ్ ఒక్కరే లీడ్ తీసుకుని అన్ని వర్గాలకు న్యాయం చేశారని.. అణచి వేయబడిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగ భద్రత కల్పించారని అన్నారు. భారత రాజ్యాంగం అంత పటిష్టంగా ఉందంటే దానికి అంబేద్కర్ కృషి అని కొనియాడారు. కుల వివక్ష వలన ఎస్సీ, ఎస్టీలకు సమాజంలో మోటివేషన్ మోటివేషన్ లేదని.. సహకారం లేదే ఉద్దేశంతోనే రిజర్వేషన్లు తీసుకొచ్చారు అన్నారు. ఎంతో ముందు చూపుతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించారని, కనీస వేతనాలు, 8






గంటలే పని మొదలైన సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. బాబాసాహెబ్ మార్గంలో విద్యాసంస్థలు స్థాపించి సేవ చేస్తున్నామని.. డొనేషన్లు తీసుకోకుండా విద్యార్థులను చదివిస్తున్నామని చెప్పారు మంత్రి. తమ విద్యా సంస్థల్లో 70 శాతం ఎస్సీ ఎస్టీ విద్యార్థులు.. పేదవాళ్లు, కూలీ వాళ్లు, ఆటోడ్రైవర్ల పిల్లలు చదువుతున్నారని.. ఎలాంటి లాభం ఆశించకుండా నడుపుతున్నట్లు తెలిపారు. 80 శాతం మార్కులు వస్తే ఫీజు లేకుండా విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆలిండియాలో అంబేద్కర్ లా కాలేజ్ 5వ స్థానంలో వచ్చిందని గుర్తు చేశారు. లా కాలేజీ నుంచి 8 మంది జడ్జీలు అయ్యారని తెలిపారు. తమ తండ్రి కాకా వెంకటస్వామి స్థాపించిన విద్యాసంస్థలను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

హైదరాబాద్ బేగంపేటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ ఎస్సీ/ఎస్టీ ఫెడరేషన్, ఆల్ డిఫెన్స్ ఎస్టాబ్లిష్మెంట్స్ ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంస్థలు ఈ సంయుక్తంగా కాన్ఫరెన్స్ లు నిర్వహించాయి. ఈ కాన్ఫరెన్స్ లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీస్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సురవరం భౌతిక కాయానికి ప్రముఖుల నివాళులు



**హైదరాబాద్ పెన్ పవర్:**కమ్యూనిస్ట్ యోధుడు, సీపీఐ నేత దివంగత సురవరం సుధాకర్ రెడ్డి మరణం రాజకీయ నేతలతో పాటు అభిమానులలో విషాదాన్ని నింపింది. ఆయనను కడసారి చూసేందుకు వివిధ పార్టీ నేతలు, ప్రముఖులు, అభిమానులు బారులు తీరారు. ఆదివారం (ఆగస్టు 24) హైదరాబాద్ మగ్దూం భవన్ లో ఉన్న భౌతిక కాయానికి నివాళులు అర్పించేందుకు ప్రముఖులు తరలి వచ్చారు.

**సిద్ధాంతాల కోసం రాజీపడకుండా పనిచేశారు: సీఎం రేవంత్**

సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. సుధాకర్ రెడ్డి మరణం పేదలు, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని అన్నారు. విద్యార్థి రాజకీయాలనుంచి జాతీయ రాజకీయాల వరకు చివరి శ్వాస వరకు రాజీపడని సిద్ధాంతం కొరకు పనిచేసిన నేత సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు.

**పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి: వెంకయ్యనాయుడు**

సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి సురవరం అని ఈ సందర్భంగా అన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా వన్నె తెచ్చిన వ్యక్తి ఆయన అని అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, – వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

**పేదల కోసం పరితపించిన మహనీయుడు : పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

సురవరం సుధాకర్ రెడ్డి – పేదల కోసమే పరితపించిన మహనీయుడు అని అన్నారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. మగ్దూం భవన్ లో నివాళులు అర్పించిన ఆయన.. సురవరం లాంటి వ్యక్తిని కోల్పోవడం రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు.

**జీవితాంతం పోరాటాలతో గడిపిన మహనీయుడు: మీనాక్షి నటరాజన్**

సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించారు తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్. – జీవితాంతం పోరాటాలతో గడిపిన మహనీయుడు సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. – ఆయన కుటుంబానికి, పార్టీ శ్రేణులకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు చెప్పారు.

సురవరం లేని లోటు తీర్చలేనిది: కేటీఆర్

ఎన్నో విప్లవోద్యమాల్లో, కార్మిక ఉద్యమాల్లో, తెలంగాణ ఉద్యమంలో చిరస్మరణీయమైన పాత్ర పోషించిన సురవరం అస్తమయం తెలంగాణ ప్రజలకు తీరని లోటు అన్నారు బీఆర్ఎస్ నేత కేటీఆర్. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి మద్దతుగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా ముందుకు రావడం వెనుక ఆయన పాత్ర ఉందని అన్నారు. సురవరం కుటుంబానికి, సీపీఐ పార్టీకి సానుభూతి ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

సురవరం సుధాకర్ రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి సీపీఐ నేతలు, కార్యకర్తలతో పాటు వివిధ పార్టీల నేతలు, అభిమానులు తరలి వచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్క, మాజీ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ఎన్వీ రమణ, సీపీఐ అగ్రనేత డి.రాజా, బీఆర్ఎస్ నేత కేటీఆర్, సినీ నటుడు ఆర్ నారాయణ మూర్తి తదితరుల ప్రముఖులు నివాళులు అర్పించారు.

# స్వాతి శరీర భాగాల కోసం వెతకడం ఆపేసిన పోలీసులు.. కారణం ఏంటంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్: మేడిపల్లిలో భార్యను హత్య చేసి ముక్కలుముక్కలు చేసిన కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. హత్యకు గురైన స్వాతి శరీర భాగాలను ఆమె భర్త మహేందర్ రెడ్డి మూసీలో పడేశాడు. దీంతో.. స్వాతి శరీర భాగాల కోసం మూసీలో వెతుకులాట సాగించారు. మూసీలో సుమారు 10 కిలోమీటర్ల వరకు వెతికారు. అప్పటికీ ఆమె శరీర భాగాలు దొరకకపోవడంతో గాలింపు నిలిపివేశారు. మూసీలో వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో గాలింపు ఆపేశారు.ఇక.. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడైన స్వాతి భర్త మహేందర్ రెడ్డిని పోలీసులు రిమాండ్?కు తరలించారు. మేడిపల్లి పీఎస్ పరిధి బోడుప్పల్ ఈస్ట్ బాలాజీ హిల్స్?లో స్వాతి అనే వివాహితను ఆమె భర్త మహేందర్ రెడ్డి విచక్షణారహితంగా చంపి ముక్కలు చేశాడు. ఈ కేసులో మహేందర్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు అతని స్టేట్మెంట్ రికార్డ్ చేసి రిమాండ్?కు తరలించారు. నిందితుడిని వైద్య పరీక్షల నిమిత్తం ఘట్ కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మహేందర్ రెడ్డి, స్వాతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చారు. మహేందర్ రెడ్డి క్యాబ్ డ్రైవర్?గా చేస్తున్నాడు. స్వాతి పంజాగుట్టలోని కాల్ సెంటర్లో పనిచేసింది. ఇద్దరి మధ్య గొడవలు ఉండేవి. వికారాబాద్?లో 498 కేసు కూడా అయ్యింది. పెద్దల సమక్షంలో కాంప్రమైజ్ అయ్యారు. అయినప్పటికీ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. చిన్న చిన్న విషయాలకే గొడవలు పడేవాళ్ళు.

ఇదే తరహాలో మొన్న.. ఆగస్ట్ 22న కూడా గొడవ పడ్డారు. స్వాతి గర్భవతి. మెడికల్ చెకప్?కి తీసుకెళ్ళమని అడిగింది. ఈ విషయంలో మొదలైన గొడవ పెద్దదయింది. భార్య స్వాతిని హత్య చేయాలని మహేందర్ రెడ్డి నిర్ణయించుకున్నాడు. బోడుప్పల్?లో ఒక హాక్సా బ్లేడ్ కొన్నాడు. ఇంట్లో ఉన్న భార్యను గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత హాక్సా బ్లేడ్?తో ముక్కలు ముక్కలు చేశాడు. తల ఒకసారి.. కాళ్ళు ఒకసారి.. చేతులు మరోసారి.. ఇలా మూడు సార్లు కవర్లలో చుట్టి శరీర భాగాలను ప్రతాప్ సింగారం మూసీలో పడేశాడు.

## హైదరాబాద్ బంజారాహిల్స్?లో కారు బీభత్సం.. కేబీఆర్ పార్కు ఫుట్ పాత్, ప్రహరీ గోడ ధ్వంసం




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో యవత రెచ్చిపోతోంది. కార్లతో బయటకు వచ్చి రోడ్లపై రచ్చ రచ్చ చేస్తున్నారు. యువకులు గ్రూప్ గా కార్లలో ఎక్కి కేరింతలు పెడుతూ.. అతివేగంతో వెళ్తూ కట్లు కొట్టడం, స్టంట్స్ చేయడం ఈ మధ్య ఎక్కువయ్యింది. ఆదివారం (ఆగస్టు 24) బంజారాహిల్స్ లో కారు చేసిన బీభత్సం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. ఉదయం కేబీఆర్ పార్కు దగ్గర కారు అతివేగంతో వచ్చి ఫుట్ పాత్ ఎక్కింది. అదే వేగంతో వెళ్లి పార్కు ప్రహరీ గోడను ఢీకొట్టడంతో గోడ ధ్వంసమైంది. ఐదురుగు యువకులతో ఉన్న కారు అతివేగంగా కేబీఆర్ పార్క్ ఫుట్ పాత్ పైకి దూసుకెళ్లింది. ప్రహరీ గోడ కూలిపోగా.. కారుకు డ్యామేజ్ జరిగింది. కారులోని ఐదుగురు యువకుల్ని పోలీసులుఅదుపులోకి తీసుకున్నారు. కేబీఆర్ పార్కు దగ్గరలో ఒకవైపు మారథాన్ జరుగుతుండగా.. కారు బీభత్సం సృష్టించడం ఆందోళనకు గురి చేసింది. దీంతో కారు నడిపి యువకుడితో పాటు మిగతా నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

## కరీంనగర్ లో రెండో విడత జనహిత పాదయాత్రలో మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర కరీంనగర్ కు చేరుకుంది. ఆదివారం ( ఆగస్టు 24 ) కరీంనగర్ లో రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభించారు మీనాక్షి నటరాజన్. జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం ఉప్పర మల్యాల నుంచి పాదయాత్ర ప్రారంభించారు మీనాక్షి నటరాజన్. ఈ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, మక్కాన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రమంలో ఉప్పర మల్యాల లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించారు నేతలు. ఇవాళ ప్రారంభమైన రెండో విడత జనహిత పాదయాత్ర గంగాధర మండల కేంద్రంలోని మధురానగర్ చౌరస్తాలో ముగియనుంది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీటింగ్ లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు నేతలు.

# బాధ్రపదమాసం .. వినాయకచవితే కాదు..చాలా పండుగలు ఉన్నాయి..

# పితృదేవతల పూజలు ( మహాలయపక్షాలు) ఈ నెలలోనే.

**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రావణమాసం .. ఆగస్టు 23 ... పోలాల అమావాస్యతో ముగిసింది. ఈ రోజు నుంచి అంటే ఆగస్టు 24 నుంచి ఈ ఏడాది ( 2025) బాధ్రపదమాసం ప్రారంభమైంది. భాద్రపదం అనగానే అందరికీ గుర్తొచ్చేది వినాయకచవితి పర్వదినమే. కాని వరాహజయంతి, వామనజననం, రుషిపంచమి, ఉండ్రాళ్ల తద్దె, పితృదేవతలకు ఉత్తమగతులు కల్పించే మహాలయ పక్షం. ఇలా మాసానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అందుకే చివరి 15 రోజుల్లో పితృదేవతలను పూజించాలి. ఈ నెలలో ఏఏ పండుగలు ఎప్పుడు .. మహిళలు చేయాల్సి వ్రతాల గురించి తెలుసుకుందాం. .



బాధ్రపదమాసం ఇటు దేవతా పూజలకు.. అటు పితృదేవతలను కూడా పూజించే నెల. వినాయకచవితి..రాధాష్టమి.. ఉండ్రాళ్ల తద్దె.. వామన జయంతి.. ఇలా అనేక రకాల పుణ్యతిథులున్నాయి. ఇక పితృదేవతలు భూమిపై చివరి 15 రోజుల పాటు సంచరిస్తారని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఓ పక్కా దేవతా పూజలకు మరో పక్క పితృదేవతలను కూడా ఈ మాసంలోనే పూజిస్తారు. తెలుగు నెలల్లో భాద్రపద మాసం ఆరవనెల . ఈ మాసంలోని పూర్ణిమ తిథినాడు చంద్రుడు పూర్వాభాద్ర నక్షత్రం సమీపంలోగాని, ఉత్తరాభాద్ర నక్షత్రం సమీపంలోగానీ ఉండడంవల్ల ఈ మాసానికి భాద్రపద మాసం అని పేరు వచ్చింది. భాద్రపద మాసం వర్షఋతువులో రెండో మాసం. భాద్రపద మాసంలోని శుక్లపక్షంలో అంటే మొదటి 15 రోజులు దేవతలను పూజిస్తారు. తరువాత 15 రోజులు అనగా కృష్ణపక్షం పితృదేవతల ఆరాధనలకు అత్యంత ప్రీతికరమైన కాలంగా పురాణాలు చెబుతున్నాయి. విష్ణుమూర్తి .. దశావతారాలలో మూడవ అవతారమైన శ్రీ వరాహ అవతారాన్ని... ఐదవదైన శ్రీ వామనావతారాన్ని భాద్రపద మాసంలోనే శ్రీమన్నారాయణుడు ధరించి దుష్టశిక్షణ గావించాడు. అందుకే ఈ మాసంలో 'దశావతార వ్రతం' చెయాలనే శాస్త్రాల్లో ఉందని పండితులు చెబుతున్నారు. భాద్రపదమాసంలోని అష్టమి శ్రీకృష్ణ పరమాత్మను పూజించేందుకు చాలా మంచి రోజు . ఆ రోజు పవిత్ర ప్రేమకు చిహ్నంగా చెప్పబడుతున్న శ్రీ రాధాకృష్ణులను పూజించాలి. ఈ రోజునే రాధాష్టమి అంటారు. ఆ రోజున రాధాకృష్ణులను పూజించడంవల్ల సంసార సుఖం లభిస్తుందని, భార్యాభర్తల మధ్య అనురాగం పెరుగుతుందని పండితులు చెబుతున్నారు.

భాద్రపద మాసంలో స్త్రీలు చేయాల్సిన వ్రతాలు

**హరితాళిక వ్రతం , సువర్ణగౌరీ వ్రతం ( ఆగస్టు 26) :** భాద్రపద శుక్ల పక్ష తదియనాడు 'హరితాళిక వ్రతం' లేదా 'సువర్ణ గౌరీ వ్రతం' 'పదహారు కుడుముల తద్దె' ఆచరిస్తారు. శివపార్వతులను పూజించి, పదహారు కుడుములను తయారుచేసి నైవేద్యంగా సమర్పించవలెను. ఈ పూజను కన్యలు పాటించడంవల్ల వారికి మంచి భర్త లభిస్తాడు. ముత్తయిదువలు పాటించడంవల్ల వారి సౌభాగ్యం అభివృద్ధి చెందుతుంది.

**శుక్ల చవితి :** వినాయక చవితి ( ఆగస్టు 27) : ఏ పూజ అయినా, వ్రతమైనా, చివరకు ఏ పని ప్రారంభించాలన్నా ముందుగా వినాయకుడిని పూజించడం మన సాంప్రదాయం. అటువంటి వినాయకుడి జన్మదినంను వినాయక చవితి .... లేదా గణేశ చతుర్థి.... పర్వదినంగా జరుపుకుంటారు.

ఆనాడు వినాయకుడి ప్రతిమను ఇంటిలో ప్రతిష్టించి స్వామివారికి పూజ చేసి గరికతో పాటు, 21 పత్రాలతో పూజించి , వ్రతకథ చెప్పుకుని, ఉండ్రాళ్ళు, కుడుములను నైవేద్యంగా సమర్పించవలెను. ఈ పండుగను వాడవాడలా ఘనంగా తొమ్మిది రాత్రులు జరుపుకుంటారు.

**శుక్ల ఏకాదశి : పరివర్తన ఏకాదశి( సెప్టెంబర్ 3) :** తొలి ఏకాదశినాడు క్షీరాబ్ధిపై శేషతల్పంమీద శయనించిన శ్రీమహావిష్ణువు ఆ రోజున ప్రక్కకు పొర్లుతాడు అంటే పరివర్తన చెందుతాడు . అందకే ఈ ఏకాదశిని పరివర్తన ఏకాదశి... .విష్ణు పరివర్తన ఏకాదశి అని ... పద్మ పరివర్తన ఏకాదశి అని అంటారు. ఆరోజు ఏకాదశి వ్రతం ఆచరించడంవల్ల కరువుకాటకాలు రావని, వచ్చివుంటే విముక్తి లభిస్తుంది.

**శుక్ల ద్వాదశి : వామన జయంతి :** దశావతారాల్లో ఐదవదైన వామనావతారాన్ని శ్రీమహావిష్ణువు ఆరోజు ధరించినట్లుగా పురాణాల ద్వారా తెలుస్తుంది. ఆరోజు విష్ణుమూర్తి స్వరూపమైన వామనుడిని పూజించి, వివిధ నైవేద్యములు సమర్పించి, పెరుగును దానం చేయాలని పండితులు చెబుతున్నారు.

**శుక్ల చతుర్దశి :** అనంత చతుర్ధశి ( సెప్టెంబర్ 6) : అనంతుడు అనేది శ్రీమహావిష్ణువుకు ఉండే పేర్లలో ఒకటి. శ్రీమహావిష్ణువును అనంతుడిగా పూజిస్తూ చేసే వ్రతమునకే అనంత చతుర్దశి వ్రతం... లేదా .... అనంత పద్మనాభ వ్రతం... అని అంటారు. ఈ వ్రతం గురించి శ్రీకృష్ణ పరమాత్మ ధర్మరాజుకు వివరించినట్లు భవిష్యోత్తర పురాణంలోఉందని రుషిపుంగవులు తెలిపారని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.

**ఉండ్రాళ్ళ తద్ది ( సెప్టెంబర్ 10) :** భాద్రపద బహుళ తదియ నాడు అవివాహితలు చేసే వ్రతం . తెల్లవారుజామునే నిద్రలేచి తలస్నానం చేసి దేవతాపూజ చేసి, ఉండ్రాళ్ళు నైవేద్యం పెట్టి సాయంత్రం ఊయలలో వూగుతారు.

**కృష్ణ పక్ష ఏకాదశి :** అజ ఏకాదశి ( సెప్టెంబర్? 17): అజ ఏకాదశినే 'ధర్మప్రభ ఏకాదశి' అని కూడా అంటారు. పూర్వం గౌతమ మహర్షి చెప్పిన ఈ వ్రతం చేసి రాజ్యాన్ని, భార్యాకుమారులను పోగొట్టుకుని కాటికాపరిగా పని చేసిన హరిశ్చంద్రుడు వాటిని తిరిగి పొందినట్లు పురాణాల్లో ఉంది. బాధ్రపదమాసం కృష్ణ పక్ష ఏకాదశి నాడు వ్రతం ఆచరించడంతోపాటు నూనెగింజలు దానం చేయాలని పండితులు అంటున్నారు.

### మహాలయపక్షాలు.. పితృదేవతలను పూజించే రోజులు

బాధ్రపద మాసంలో చివరి 15 రోజులను( సెప్టెంబర్ 8వ తేదీ నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకు) మహాలయ పక్షం అంటారు. ఈరోజుల్లో పితృ దేవతలను పూజిస్తారు. పంచాంగం ప్రకారం ఏ తిథి రోజు మరణిస్తే ఆరోజు పితృ దేవతలకు పిండ ప్రదానం చేయాలి. అమావాస్య రోజున ఏడు తరాల పితృ దేవతలను శాస్త్ర ప్రకారంగా పూజించాలి. బాధ్రపదమాసం చివరి 15 రోజులు మహాలయ పక్షాలు కాబట్టి ఆ రోజుల్లో శుభకార్యాలకు పనికిరాదు. ఈ పక్షంలో పదిహేనురోజులపాటు పితృదేవతలకు తర్పణాలు వదలడం, శ్రాద్ధవిధులను నిర్వహించడం, పిండప్రదానం చేయడం ఆచరించాలని శాస్త్రాలు చెప్తూ ఉన్నాయి. ఈ రకమైన విధులను నిర్వహించడంవల్ల గయలో శ్రాద్ధ విధులను నిర్వహించినంత ఫలం లభిస్తుంది.

# హైదరాబాద్-తిరుపతి అలయన్స్ ఎయిర్ విమానం రద్దు... ప్రయాణికుల ఆగ్రహం

- హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన విమానం రద్దు
- అలయన్స్ ఎయిర్ విమానంలో పదేపదే సాంకేతిక సమస్యలు
- ఉదయం బయలుదేరే సమయంలో ఘటన
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నుంచి తిరుపతికి బయలుదేరాల్సిన అలయన్స్ ఎయిర్ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చివరి నిమిషంలో సర్వీసును రద్దు చేశారు. ఉదయం ఈ ఘటన చోటుచేసుకోవడంతో, ప్రయాణానికి సిద్ధమైన వందలాది మంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, షెడ్యూల్ ప్రకారం అలయన్స్ ఎయిర్‌కు చెందిన విమానం హైదరాబాద్ నుంచి తిరుపతికి బయలుదేరాల్సి ఉంది. అయితే, విమానం టేకాఫ్ అయ్యేందుకు సిద్ధమవుతున్న సమయంలో పదేపదే సాంకేతిక లోపాలు తలెత్తినట్లు సిబ్బంది గుర్తించారు. తొలుత సాంకేతిక సిబ్బంది ఓ లోపాన్ని సరిచేసినప్పటికీ, ఆ తర్వాత మరో లోపం తలెత్తడంతో మరమ్మతులకు మరింత సమయం పడుతుందని అంచనా వేశారు. దీంతో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు అలయన్స్ ఎయిర్ అధికారులు తెలిపారు. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలిగిందని ఆవేదన చెందారు. ఇటీవల కాలంలో అలయన్స్ ఎయిర్ విమానాల్లో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం విమానంలోని సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు ఇంజినీరింగ్ బృందాలు పనిచేస్తున్నాయని సంస్థ వర్గాలు వెల్లడించాయి.